సాక్షి బాపట్ల
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



వెల్లటూరులో లక్ష్మీగణపతి హోమం
భట్టిప్రోలు: వెల్లటూరు వూట కాల్వ వద్ద కొలువైన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.



అయోధ్య స్వామి ఆరాధన
పెదకూరపాడు: 75 త్యాళ్లూరు గ్రామంలో గురువారం అయోధ్య స్వామి 18వ ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పల్లకీలో ఊరేగించారు.



నిజ శ్రావణమాస పూజలు
విజయవాడ : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిజ శ్రావణ మాస పూజలు ప్రారంభమయ్యాయి. గురువారం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

రేపటి జెడ్పీ స్థాయీ సంఘ, సర్వసభ్య సమావేశాలు వాయిదా

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎన్నిక దృష్ట్యా..

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ, సర్వసభ్య సమావేశాలను వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈవో జె.మోహన్ రావు గురువారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జెడ్పీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరగాల్సి ఉన్నాయి. అదే విధంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాధారణ సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండగా, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలకు సంబంధించిన వార్డు మెంబర్లు, సర్పంచ్‌ల ఎన్నిక కోసం ఎన్నికల సంఘ నోటిఫికేషన్ జారీ చేసిన దృష్ట్యా సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాల్సిన దృష్ట్యా, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సూచన మేరకు సమావేశాలను వాయిదా వేశామని, తదుపరి సమావేశాన్ని నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

నేడు ఎంప్లాయీస్ గ్రీవెన్స్

పల్నాడు కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన సమావేశ మందిరంలో ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ గురువారం తెలిపారు. ప్రతినెలా మూడో శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంప్లాయీస్ గ్రీవెన్స్ ఉంటుందని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తమ సమస్యలను గ్రీవెన్స్‌లో తెలియజేసి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. జిల్లా అధికారులు గ్రీవెన్స్‌కు హాజరు కావాలని ఆదేశించారు.

ఆర్టీసీ డిపోల్లో ..

నరసరావుపేట ఈస్ట్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కార్యాలయంతో పాటు పల్నాడులోని అన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ల కార్యాలయాలలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్ ఉంటుందని వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యలపై ఆన్‌లైన్ లేదా వ్యక్తిగత దరఖాస్తుల ద్వారా తెలియజేసి పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

తిరువన్నామలై, వేలాంగిణికి చీరాల మీదుగా రైలు

చీరాల: ప్రముఖ హిందూ, క్రైస్తవ పుణ్యక్షేత్రాలైన తిరువన్నామలై, వేలాంగిణికి చీరాల మీదుగా రైలు సౌకర్యాన్ని కల్పించారు. సికింద్రాబాద్ నుంచి వేలాంగిణికి కొత్తగా ప్రవేశపెట్టిన ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతి ఆది, మంగళవారాల్లో చీరాల మీదుగా ప్రయాణిస్తుందని, మధ్యలో తిరువన్నామలైలో ఆగుతుందని రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు.

జగనన్న కాలనీని పరిశీలించిన ఎండీ లక్ష్మీశా



మేడికొండూరు: గుంటూరు జిల్లా పేరేచర్ల కైలాసగిరి ప్రాంతంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని వైఎస్సార్ లే-అవుట్ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా గురువారం పరిశీలించారు. జగనన్న కాలనీల్లోని గృహాలను పేరేచర్లలో అత్యంత వేగవంతంగా నిర్మించడం జరిగిందని ఆయన వివరించారు. ప్రతి కాలనీ ముందు భాగంలో జగనన్న కాలనీ ఆర్చీలు నిర్మించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పీడీ వేణుగోపాల్, ప్రత్యేక అధికారి వీరాచారి, ఈఈ శంకరరావు, డీఈఈ సీతారామయ్య, మేడికొండూరు ఏఈ దివ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 120, బ్యాంక్ కెనాల్‌కు 1,228, తూర్పు కెనాల్‌కు 385, పశ్చిమ కెనాల్‌కు 269, నిజాంపట్నంకు 297, కొమ్మమూరుకు 2,020 క్యూసెక్కులు విడుదల చేశారు.

వైఎస్సార్ సీపీదే విజయం

- బాపట్ల జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలు మావే
- ప్రజలంతా సంక్షేమ సర్కారు వైపే..
- ప్రతి ఇంటికీ పథకాల లబ్ధి
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రీజినల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాబోయే ఎన్నికల్లో బాపట్ల జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రీజినల్ కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన విజయసాయిరెడ్డి గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో అద్దంకి, పర్చూరు, చీరాల, రేపల్లె నియోజకవర్గాలను పోగొట్టుకున్నామని, రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో విజయం సాధిస్తామని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు, ప్రజలతో మాట్లాడిన తర్వాత గెలుపుపై స్పష్టత వచ్చిందన్నారు. జిల్లాలో రీజినల్ కో–ఆర్డినేటర్ హోదాలో తొలిసారి పర్యటించి అందరితోనూ సమావేశమయ్యామని పేర్కొన్నారు. రెండో విడతలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పర్యటన ఉంటుందని వివరించారు. మూడో విడతలో ప్రజల ఆసక్తిని దృష్టిలో పెట్టుకొని, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమన్వయం కోసం కో–ఆర్డినేటర్ల సమావేశాలు మండల స్థాయిలో జరుపుతామని వెల్లడించారు. జగనన్న సురక్ష ద్వారా అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తోందని, ఎక్కడైనా మిగిలి ఉంటే ఆ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు స్థలం అడిగారని, దీనిని పరిశీలిస్తామని పేర్కొన్నారు. బాపట్లలోని అంబేడ్కర్ భవన ఆధునికీకరణ కోసం రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారని, ఆ నిధులను ఎంపీ లాడ్స్ నుంచి మంజూరు చేస్తానని హామీ ఇచ్చామని పేర్కొన్నారు. ముస్లిం షాదీఖానా పెండింగ్ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అద్దంకి, చీరాల పర్చూరులో ఎటువంటి సమస్యలూ లేవన్నారు. ఏ నియోజకవర్గానికి చెందిన ఇన్‌చార్జిలు ఆ నియోజకవర్గాల్లోనే పనిచేస్తారన్నారు. అందరూ పార్టీ ఆదేశాల మేరకే పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో సమస్యలు పునరావృతం కావని చెప్పారు.

ప్రతి సీటూ గెలవాల్సిందే

రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని ప్రతి సీటూ గెలవాల్సిందేనని, ఇందుకోసం నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బాపట్ల, పర్చూరు, చీరాల, రేపల్లె, అద్దంకి, వేమూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో సమీక్షలు నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు చేకూరుస్తున్న లబ్ధిని, ప్రజల్లో వస్తున్న స్పందనను అడిగి తెలుసుకున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపైనా చర్చించారు. పార్టీ శ్రేణుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ మరింత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, పార్టీ చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్, అద్దంకి ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, పార్టీ పరిశీలకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- పీఆర్ ఏఈ సస్పెన్షన్‌కు ఆదేశం

బాపట్ల: ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణ పనులను సెప్టెంబరు 15వ తేదీలోగా అధికారులు పూర్తిచేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారులతో గురువారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో చేపట్టిన భవనాల నిర్మాణ లక్ష్యాలు చేరుకోవాలని తెలిపారు. భవన నిర్మాణాలలో ఏజెన్సీల సమస్యలు ఉత్పన్నమైతే తక్షణమే ఏజెన్సీలను మార్చాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున వేగంగా నిర్మించాలన్నారు. గ్రామాలకు స్థిరాస్తులుగా ఉండే ప్రభుత్వ భవనాలు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి ఇంజినీరింగ్ అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. రేపల్లె మండలంలో గ్రామ సచివాలయాల నిర్మాణ పనులు జరగకపోవడంపై పీఆర్ ఏఈని సస్పెండ్ చేయాలని సంబంధిత ఎస్‌ఈని కలెక్టర్ ఆదేశించారు. ఎన్ని పర్యాయాలు సూచించినా పనులలో పురోగతి కనిపించకపోవడంపై ఇంజినీరింగ్ అధికారులను మందలించారు. విధినిర్వహణలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాలు గడువులోగా పూర్తిచేయాలని తెలిపారు. 133 గ్రామ సచివాలయాల భవనాలు పూర్తి చేసి సంబంధిత శాఖకు అప్పగించగా మిగిలినవి రూఫ్ దశలో 7, మొదటి శ్లాబ్ దశలో 32, రెండో శ్లాబ్ దశలో 35 భవనాలు, తుది నిర్మాణ దశలో 42, విద్యుద్దీకరణ, నీటివసతి పనుల దశలో 51 ఉండడంపై ఆరా తీశారు. 73 రైతు భరోసా కేంద్రాలు పూర్తయ్యాయన్నారు. రూఫ్ దశలో 10, శ్లాబ్ దశలో 30, తుదిదశలో 24, విద్యుద్దీకరణ, నీటివసతి పనులలో 13 ఉన్నాయన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు ఇప్పటివరకు 55 పూర్తికాగా రూఫ్ దశలో 17 ఉన్నాయని చెప్పారు. శ్లాబ్ దశలో 36, తుదిదశలో 45, విద్యుద్దీకరణ, నీటివసతి పనులలో 12 భవనాలు పెండింగ్‌లో ఉండడంపై అధికారులను నిలదీశారు. కొరిశపాడు మండలంలో రెండేళ్లుగా పనులు నిలిచిపోతే అధికారులు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. కర్లపాలెం, కొరిశపాడు, సంతమాగులూరు, కారంచేడు మండలాలలో పనుల పురోగతి లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఏఈలకు షోకాజ్ నోటీసు జారీచేయాలని ఎస్‌ఈని ఆదేశించారు. జగనన్న కాలనీలలో భూమి చదును, తదితర 97 పనులు పెండింగ్లో ఉండడంపై కలెక్టరు ఆరాతీశారు. జగనన్న కాలనీలలో 74 ఆర్చీలు నిర్మించాలని ఆయన సూచించారు. 88 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పనులు సత్వరమే పూర్తిచేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ హరేరామకృష్ణ, డ్వామా పీడీ వై.శంకర్‌నాయక్, గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1 పరీక్షల్లో మెరిసిన తెనాలి తేజం

అసిస్టెంట్ కమిషనర్ జీఎస్టీగా స్రవంతిరెడ్డి



తెనాలి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష ఫలితాల్లో తెనాలి తేజం మెరిసింది. గురువారం సాయంత్రం వెలువడిన ఫలితాల్లో పట్టణానికి చెందిన మారంరెడ్డి స్రవంతి రెడ్డి గ్రూప్–1 సర్వీసెస్‌లో 10వ స్థానంలో నిలిచి అసిస్టెంట్ కమిషనర్ జీఎస్టీ పోస్టుకు ఎంపికైంది. స్థానిక ఎస్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న మారంరెడ్డి దశరథ రామిరెడ్డి కుమార్తె స్రవంతిరెడ్డి. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి అనుబంధంగా గల బాపట్ల వ్యవసాయ కళాశాలలో 2015–19లో అగ్రికల్చర్ బీఎస్సీ చదివి 93.5 జీపీఏతో స్రవంతిరెడ్డి ఉత్తీర్ణురాలైంది. 2022లో నాటి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ విష్ణువర్ధన రెడ్డి చేతుల మీదుగా బంగారు పతకం స్వీకరించారు. డిగ్రీ పూర్తయ్యాక సివిల్స్ పరీక్షలకు ప్రిపేరవుతూ ముందుగా వచ్చిన గ్రూప్–1 పరీక్షలు రాసిన స్రవంతిరెడ్డి తొలి యత్నంలోనే విజయం సాధించారు. అసిస్టెంట్ కమిషనర్ జీఎస్టీగా పదవిని సాధించారు. సివిల్స్ సాధించాలనేది తన లక్ష్యమని, గ్రూప్–1 పరీక్షల్లో విజయంతో వచ్చిన ఉద్యోగంలో చేరి, సివిల్స్ లక్ష్యాన్ని నెరవేర్చుకుంటానని స్రవంతిరెడ్డి చెప్పారు.

కల్యాణ శ్రావణం

- బలమైన ముహూర్తాలను మోసుకొచ్చిన నెల
- పెళ్లిపీటలెక్కే జంటలకు దివ్య ఘడియలెన్నో..
- కల్యాణ మండపాలకు పెరిగిన గిరాకీ
- వేలాది మంది కార్మికుల ఉపాధికి వరం



బాపట్ల అర్బన్: అడుగులో అడుగై కలకాలం వెంట నడిచే తోడు కోసం నిరీక్షించే మగువకు.. ఆశల ఉషస్సుల్లో ఊయల లూపే వరునికి ముడివేసే ఘడియ పెళ్లి ముహూర్తం. నిండు నూరేళ్లు వైవాహిక బంధం దృఢంగా ఉండాలంటే బలమైన ముహూర్తంలో ఒక్కటవ్వాలని హిందువులు విశ్వసిస్తారు. అమృత ఘడియల కోసం పండితులను ఆశ్రయిస్తారు. అలాంటి బ్రహ్మ ముహూర్తాలను మోసుకొచ్చింది శ్రావణం. పెళ్లి మండపాలకు నక్షత్ర కాంతులద్దుతోంది. భాజభజంత్రీ కళాకారులు, బ్రాహ్మణులు, విద్యుత్ కార్మికుల జీవితాలతోపాటు టెంట్ హౌస్‌లకు కొత్త శోభను తీసుకొస్తోంది. ఎన్నో కుటుంబాల్లో ఆనందాలు నింపుతోంది.

పదిరోజులపాటు వరుసగా

సాధారణంగా శ్రావణ మాసంలోనే ఎక్కువగా పెళ్లిళ్లు జరుగుతాయి. శుక్రవారం నుంచి ఈ మాసం ఆరంభమవుతోంది. దాదాపు వరసగా పది రోజులపాటు బలమైన వివాహ ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. దీంతో సర్వత్రా సందడి నెలకొంది.

అన్నింటికీ డిమాండే

శ్రావణమాసంలో చాలా ముహూర్తాలు ఉన్నా.. కొన్నింటిని దివ్యమైనవిగా పండితులు పేర్కొంటున్నారు. అలాంటి ఘడియల్లోనే తమ పిల్లల పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ఆశపడుతున్నారు. ఫలితంగా ఆయా తేదీల్లో కల్యాణ మండపాలతోపాటు అన్నింటికీ విపరీతమైన డిమాండ్ నెలకొంది. కల్యాణ మండపాలు దొరక్క చాలా మంది ప్రైవేటు స్థలాల్లో వేడుకలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శ్రావణ మాసంలో జిల్లాలో వెయ్యికిపైగా పెళ్లిళ్లు జరిగే ఆస్కారం ఉందని చెబుతున్నారు.

ఎందరికో ఉపాధి

పెళ్లంటే రెండు జీవితాల కలయిక మాత్రమే కాదు.. ఎందరికో ఉపాధి కూడా. పెళ్లి పత్రికల ముద్రణ, ఫ్లెక్సీల ఏర్పాటు, కల్యాణ మండపం, అద్దె గదులు తీసుకోవడం, ఫ్లవర్ డెకరేషన్, భోజనాలు, ఫొటోలతోపాటు వీడియోలు తీయడం పెళ్లికూతురు అలంకరణ, పురోహితులు, భజంత్రీలు, రవాణా ఇలా వేలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుంది అలాగే బంగారు, నిత్యవసర సరుకులు, వస్త్ర వ్యాపారాలు కూడా కళకళలాడతాయి. పట్టు వస్త్రాలకు బాపట్ల, చీరాల పెట్టింది పేరు కావడంతో దుకాణాలు కిటకిటలాడతాయి.

ఇవి మంచి ముహూర్తాలు



ఆగస్టు 20, 21, 23, 27, 31 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబర్‌లో 1,3,10 తేదీల్లోనూ బలమైన ముహూర్తాలు ఉన్నాయి. ఇప్పటి నుంచి డిసెంబర్ వరకు పెళ్లిళ్ల సీజనే.

– నెమలికంటి హనుమంతరావు, అర్చకులు, నిర్వాహకులు, శ్రీలలితా త్రిపుర సుందరీ పీఠం, బాపట్ల

ఒకే తేదీలో చాలా పెళ్లిళ్లు

కల్యాణ మండపాలకు బాగా గిరాకీ కనబడుతోంది. ఒకే తేదీలో చాలా పెళ్లిళ్లు ఉంటున్నాయి. మా మండపాన్ని ఇప్పటికే చాలా మంది బుక్ చేసుకుంటున్నారు. ముందుగా బుక్ చేసుకున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నాం.

– ఇక్కుర్తి శ్రీనివాసరావు, కాపు కల్యాణ మండపం నిర్వాహకుడు, బాపట్ల

అస్వస్థతతో గంట వ్యవధిలోనే అన్నాచెల్లెళ్ల మృతి

- ఒకే కుటుంబంలో నలుగురికి అస్వస్థత
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులు
- చినగార్లపాడు గ్రామంలో విషాదం



రామయ్య మృతదేహం



కోటమ్మ (ఫైల్)

కారెంపూడి: అస్వస్థతకు గురై చెల్లెలు మృతి చెందిన గంట వ్యవధిలోనే అన్న కూడా తుది శ్వాస విడిచిన ఘటన మండలంలోని చినగార్లపాడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. తీవ్ర జ్వరం, వాంతులు, విరేచనాలతో వీరు మృత్యువాత పడినట్టుగా తెలుస్తోంది. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన చల్లా రామయ్య వ్యవసాయకూలి. రెండు రోజుల క్రితం ఆయన చెల్లెలు ఇర్ల కోటమ్మ దాచేపల్లి నుంచి పుట్టింటికి వచ్చింది. ఈ సందర్భంగా ఇంట్లో అందరూ సంతోషంగా విందు కూడా చేసుకున్నారు. రామయ్య, కోటమ్మ, రామయ్య కుమారులు గోపీచంద్, లోకేష్ ఒక్కసారిగా బుధవారం అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. కోటమ్మ, రామయ్య గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ వద్ద చికిత్స తీసుకున్నారు. పిల్లలను పిడుగురాళ్లలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే బుధవారం రాత్రి కోటమ్మ (27) మరణించింది. ఆతర్వాత గంటకే రామయ్య(32)కూడా మృత్యువాత పడ్డాడు. పిల్లలిద్దరినీ ప్రైవేటు ఆస్పత్రి నుంచి నర్సరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు చెప్పారు.

గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం

అన్నాచెల్లెళ్ల మృతితో కరాలపాడు పీహెచ్‌సీ డాక్టర్లు కేవీ నాగిరెడ్డి, కేవీ ప్రవీణ్ రెడ్డి గురువారం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రామయ్య కుమారుల పరిస్థితి ప్రస్తుతానికి బాగానే ఉందని, అవసరమైతే గుంటూరు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని వైద్యులు తెలిపారు. గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే చేపట్టారు. గ్రామంలో ఎక్కడా డయేరియా లక్షణాలు ఉన్న వారు లేరని వివరించారు. నిల్వ ఉన్న పలావు తినడం వల్ల రామయ్య, కోటమ్మ జబ్బున పడి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నట్టు వెల్లడించారు.

ప్రజా శాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు

ఎస్పీ వకుల్‌జిందాల్



పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

బాపట్ల టౌన్: ప్రజా శాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. ఈనెల 19న జరగనున్న పంచాయతీ ఉప ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పోలీసులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ తన కార్యాలయంలో మాట్లాడుతూ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటుచేశామని వెల్లడించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. బందోబస్తు గురించి పోలీసులతో చర్చించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి వద్ద ఎక్కువ సంఖ్యలో పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైనా ప్రజా శాంతికి భంగం కలిగేలా వ్యవహరించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయాలని చూసినా, ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.


సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన కాంట్రాక్టు అధ్యాపకులు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

చీరాల అర్బన్: మేనిఫెస్టోలో చెప్పిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ కాంట్రాక్టు అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేశారని ఆనందం వ్యక్తం చేశారు. 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గత క్యాబినెట్‌లో తీర్మానం చేశారని పేర్కొన్నారు. అయితే వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేయాలనే ఉద్దేశంతో ఏ సంఘం డిమాండ్ చేయకపోయినా, స్వయంగా ముఖ్యమంత్రి ఐదేళ్ల నిబంధనను తొలగించి 2014 జూన్ 2 ముందు నియమించి ఉన్న ఇప్పటివరకు కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ కాలేజీలో కాంట్రాక్టు ఉద్యోగులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ కో–ఆర్డినేటర్ షేక్ బాజీ, ధనరాజు, ఈశ్వరుడు, పెంచలరెడ్డి, జ్వాల మోహన్, సునీత, ఉదయశాంతి, హెప్సిబా, మాధవి, విజయకుమారి, సరళకుమారి పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 519.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 861.10 అడుగుల వద్ద ఉంది.

క్లుప్తంగా

జూడో విజేతలుగా అద్దంకి విద్యార్థులు



అద్దంకి: రాష్ట్రస్థాయిలో ఈనెల 12 నుంచి 15 వరకు నెల్లూరులో నిర్వహించిన జూడో పోటీల్లో అద్దంకి విద్యార్థులు ప్రతిభ చాటారు. పోటీల్లో అద్దంకి విద్యార్థులు సబ్ జూనియర్, సబ్ సీనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ధర్మవరం గ్రామానికి చెందిన మేడగం శ్వేతారెడ్డి సబ్ జూనియర్ విభాగంలో అండర్ 60 కేజీల్లో రెండో స్థానంలో, సెకండ్ సబ్ జూనియర్ విభాగంలో బల్లికురవకు చెందిన కేజీబీవీ విద్యార్థిని ఎస్కే షబానా మూడో స్థానం సాధించింది. వీరిని బాపట్ల జిల్లా జూడో అసోసియేషన్ చైర్మన్ చిన్ని మురళీ శాలువాతో సత్కరంచి అభినందించారు. అధ్యక్షుడు డీవీ రత్నం, కే సరళకుమారి, ప్రిన్సిపాల్ కే స్వర్ణలత అభినందించారు.

మార్గదర్శి బ్రాంచ్‌లలో సీఐడీ తనిఖీలు

నగరంపాలెం: మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచ్ కార్యాలయాల్లో సీఐడీ విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని గుంటూరు అరండల్‌పేట, తెనాలి, పల్నాడు జిల్లా నరసరావుపేట, బాపట్ల, చీరాలలోని బ్రాంచి కార్యాలయాల్లో సోదాలు జరిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు మొదలైన తనిఖీలు రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో చందదారుల వివరాలు, నగదు మళ్లింపు, ఇతరత్రా అంశాలకు సంబంధించి రికార్డులను కూలంకషంగా పరిశీలించారు. తనిఖీల్లో సీఐడీతో పాటు రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్, కార్మికశాఖ, విజిలెన్స్, డీఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఈనెలాఖరుకు 5లక్షల గృహాలకు సీఎం శంకుస్థాపన

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీశా

గుంటూరు వెస్ట్: అర్హులైన పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న జగనన్న లేఅవుట్లలోని 5 లక్షల ఇళ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెలాఖరుకు ప్రారంభించనున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ జి.లక్ష్మీశా పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డితో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో లక్ష్మీశా మాట్లాడుతూ ఈ నెలాఖరుకు జిల్లాలో 12,500 ఇళ్లను పూర్తి చేయాలనే సంకల్పంతో పనిచేయాలన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగుతుండడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో గృహ నిర్మాణ శాఖ ఏర్పడి సుమారు 50 ఏళ్లవుతుందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ నాలుగేళ్లలో గృహ నిర్మాణాలు రికార్డు స్థాయిలో



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీశా

జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటుతో పరిపాలనతోపాటు ఇళ్ల నిర్మాణాలూ సజావుగా సాగేందుకు దోహదపడుతున్నాయన్నారు. ఈ విధానం ఇతర రాష్ట్రాలకూ ఆదర్శమన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల వద్ద ఉండాలన్నారు. లేఅవుట్లలో డ్రెయినేజీ, సోప్ పిట్, మరుగుదొడ్లు నిర్మాణాలకు నిధులు కేటాయిస్తామన్నారు. ఇప్పటి వరకు నిర్మాణాలు పూర్తి చేసిన వారి వివరాలు ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో ఈనెల 25నాటికి అప్‌లోడ్ చేయాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్ లేకుండా బిల్లులు చెల్లించామని వెల్లడించారు.

12,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు 67,250 ఇళ్లు కేటాయించారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 12,500 ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. 42,451 ఇళ్లు బేస్‌మెంట్‌పై వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నిర్మాణాలు మరింత వేగం పుంజుకునేందుకు హౌసింగ్ శాఖకు అనుబంధ శాఖలు సమన్వయం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణాలు పూర్తి చేసుకున్న వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. నిర్మాణాల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, దీనిలో రాజీ ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డ్వామా పీడీ యుగంధర్ కుమార్ పాల్గొన్నారు.

కరోనా సప్తశతి వాస్తవ పరిస్థితికి దర్పణం

అద్దంకి: కరోనా సప్తశతి గ్రంథం వాస్తవ పరిస్థితులకు దర్పణం పట్టే విధంగా ఉందని రిటైర్డ్ ఆర్జేడీ యూ దేవపాలన అన్నారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రంచించిన కరోనా సప్తశతి గ్రంథావిష్కరణ కార్యక్రమం గురువారం మండలంలోని బొమ్మనంపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. పుస్తకంపై డీవీఎం సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు. పుస్తకాన్ని రావినూతల నారాయణ ఆవిష్కచరించగా, తొలిప్రతిని గుర్రం రామయ్య స్వీకరించారు. డీవీఎం సత్యనారాయణ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలు పడిన బాధలను కళ్లకు కట్టినట్లుగా కవి రచించారని చెప్పారు. పుస్తంలో ఇంటి వైద్యం ద్వారా ఎటువంటి రోగాలైనా నయం చేయగలిగిన వస్తువుల గురించి వివరిస్తూ ఉన్న పుస్తకంగా భావించవచ్చన్నారు. ఇందులో పరిష్కార మార్గాలు



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సూచించారని చెప్పారు. దేవపాలన మాట్లాడుతూ జ్యోతి చంద్రమౌళి తాతల నుంచి గ్రంథ రచనలో ప్రావీణ్యం ఉన్నవారని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ చిన్ని మురళి, చప్పిడి వీరయ్య, శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు సీహెచ్ నాగేశ్వరరావు, జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, బొమ్మనంపాడు గ్రామ ప్రజలు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు నాలుగు పంచాయతీ వార్డులకు ఎన్నికలు

- బరిలో ఎనిమిది మంది అభ్యర్థులు
- రిటర్నింగ్ అధికారులు నియామకం

అచ్చంపేట: వివిధ పంచాయతీలలో ఏర్పడిన వార్డు సభ్యుల ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 19న జరిగే ఉప ఎన్నికలలో ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం గురువారం తెలిపారు. నాలుగు వార్డులకు రిటర్నింగ్ అధికారులను నియమించామన్నారు. కొండూరు 10వార్డుకు జరిగే ఎన్నికలలో గాదె చిన్న గంగమ్మ, బత్తుల తిరుపతి స్వామి బరిలో ఉండగా 11వ వార్డుకు కొర్ని తిరుపతిస్వామి, పిల్లకతువుల చిన వెంకయ్య పోటీపడుతున్నారన్నారు. మాదిపాడు 4వ వార్డుకు జరిగే ఎన్నికలో షేక్ రఫి భార్య నాగులీబీ, షేక్ సుభాని భార్య నాగుల్‌బీ బరిలో ఉన్నారని, చెరుకుంపాలెం 10వ వార్డుకు జరిగే పోటీలో సొరెడ్డి నారాయణ, సుంకర బుజ్జి బాబు పోటీ పడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా కొండూరు 10వ వార్డుకు పంచాయతీరాజ్ ఏఈ కెవిపి శేషప్పయ్య, 11వ వార్డుకు వ్యవసాయాధికారి పి.పెద వెంకటేశ్వర్లు, మాదిపాడు 4వ వార్డుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షేక్ ఉమర్ ఫరూక్, చెరుకుంపాలెం 10వ వార్డుకు మండల విద్యాశాఖాధికారి ఆర్ నరసింహారావులను నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎం.భాస్కరరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని, రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించి, కౌంటింగ్ పూర్తి కాగానే ఫలితం ప్రకటిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

నేరాల నియంత్రణకు చర్యలు

- గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్
- గుంటూరు, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్లలో పరిశీలన

లక్ష్మీపురం: రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ రైల్వే పోలీసు అధికారులకు సూచించారు. గుంటూరు రైల్వే స్టేషన్, న్యూ గుంటూరు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ప్రజలకు, ప్రయాణీకులకు భద్రతా కల్పించే ఉద్దేశంతో రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ అధికారులు, జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి నేరాలు నియంత్రించాలని సూచించారు. గుంటూరు, న్యూ గుంటూరు, నల్లపాడు, తెనాలి, మంగళగిరి, పొన్నూరు తదితర



గుంటూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసు అధికారులతో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

రైల్వేస్టేషన్ ప్రాంతాలు, పరిసర ప్రాంతాలు, రైలులో నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈకార్యచరణలో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ స్థానిక పోలీసులు సంయుక్తంగా పాల్గొని నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేరాలను నియంత్రించేందుకు ట్రెయిన్ బీట్లు, గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నామన్నారు. అంతేకాకుండా, నేరాల నియంత్రణలో భాగంగా ఆకస్మికంగా, రైలుల్లోను, స్టేషను పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేయడం, వేలి ముద్రలను సేకరించడం, వారి బ్యాగులను తనిఖీ చేయాలన్నారు. విచారణలో వారు పాత నేరస్థులుగా నిర్ధారణ అయితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్పీ వెంట ఈస్ట్ ఏస్పీ నిచికేస్ షలేకే, రైల్వే ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు, సీఐ వేంకటేశ్వర రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుభాష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరసింహారావు, కొత్తపేట సీఐ అన్వర్ బాషా, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి

వెల్దుర్తి: మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె శ్రీనివాసరావు (45) వైద్యశాలలో విధులకు హాజరై ట్రెజరీలో పనుల నిమిత్తం గురువారం మాచర్లకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా మాచర్ల– శ్రీశైలం జాతీయ రహదారిలోని రచ్చమల్లపాడు అడ్డరోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో కె శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి బత్తిన శ్రీరామ్ శ్రీనివాసరావు మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కె శ్రీనివాసరావు

భార్య, ఆరు సంవత్సరాల బాబు ఉన్నారు. వైద్య సిబ్బంది కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

బడుగు, బలహీన వర్గాలకు అండగా వైఎస్సార్ సీపీ జెండా

- ఈనెల 22న సత్తెనపల్లిలో బీసీ గర్జన
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: జనాభాలో అత్యధిక శాతం ఉన్న బడుగు, బలహీనవర్గాలకు వైఎస్సార్ సీపీ జెండా అండగా ఉందని, యువ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో బడుగులకు రాజ్యాధికారాన్ని చేరువ చేశారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మంత్రి అంబటి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ బీసీ సామాజికవర్గానికి చెందిన నిమ్మకాయల రాజనారాయణకు ఆసియా ఖండంలోనే ఖ్యాతిగాంచిన గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా నియమించడం, నియోజవర్గానికి చెందిన నాగార్జున యాదవ్‌కు విద్యా అభివృద్ధి సంక్షేమ కల్పన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించి మన నియోజకవర్గానికి బీసీలు తరపున అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ... ఈ నెల 22వ తేదీన సత్తెనపల్లిలో బీసీ గర్జన నిర్వహిస్తున్నామన్నారు. బీసీ గర్జనకు నియోజకవర్గంలో ఉన్న బీసీలు ముఖ్యంగా యాదవ సామాజిక వర్గం ఈ కార్యక్రమాన్ని కుటుంబ పండుగలా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, సత్తెనపల్లి రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, నకరికల్లు మండల కన్వీనర్ భవనం రాఘవ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జోనబోయిన హరీష్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్లం విజయభాస్కరరెడ్డి, ముప్పాళ్ల మండల నాయకుడు నక్క శీను, లోక మాధవ్, ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్, పలు గ్రామాల బీసీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో ఈనెల 22న జరగబోయే బీసీ గర్జనకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం స్థల పరిశీలన చేశారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం బీసీ గర్జనకు అనువుగా ఉంటుందని నిర్ణయించి ఆ మేరకు అక్కడ బహిరంగసభా వేదిక, వచ్చే ప్రజలకు, వాహనాలకు ఇబ్బంది లేకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఆయనతోపాటు వల్లెల గార్డెన్స్ నిర్వాహకుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు అచ్యుత శివప్రసాద్, మర్రి సుబ్బారెడ్డి, ఈవూరి బ్రహ్మరెడ్డి, తోట లక్ష్మీనారాయణ, కొత్త రామకృష్ణ, జాని తదితరులు ఉన్నారు.

ఫలించిన నిఘా వ్యూహం

- 43 చైన్ స్నాచింగ్ కేసుల్లో నలుగురు యువకులే కీలకం
- వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు!

తాడేపల్లిరూరల్: మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలో దాదాపుగా 43 చైన్ స్నాచింగ్ కేసుల్లో కీలకమైన నలుగురు యువకుల్ని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. సేకరించిన వివరాల ప్రకారం గతంలో డిలైట్‌డాబా వద్ద ఒక కానిస్టేబుల్ తన తల్లిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వస్తుండగా ఆమె మెడలో వున్న బంగారు గొలుసు లాగడంతో ఆమె కిందపడి మృతి చెందింది. ఆ కేసుతో పాటు మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలోని, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోను, పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన 43 చైన్ స్నాచింగ్ కేసుల్లో 41 కేసుల్లో ప్రధానంగా వీరే ఉన్నట్లు పోలీసులు విచారణలో వెల్లడైందని విశ్వసనీయ సమాచారం. వీరు బైక్‌మీద వచ్చి మహిళల మెడలో తెంపిన గొలుసులు సుమారు 800 గ్రాములు నుంచి 1000 గ్రాముల వరకు ఉంటుందని అంచనా. మంగళగిరికి చెందిన ఈ నలుగురిలో ఇద్దరు ఆటో డ్రైవర్లుగా తెలియవచ్చింది. మరొకరు తాపీ కూలీ, మరొకరు చికెన్ షాపులో పనిచేసే యువకుడుగా నిర్ధారించారు. అదుపులోకి తీసుకున్న ఈ నలుగురిని రహస్యంగా పలు పోలీస్ స్టేషన్లకు తిప్పుతూ విచారిస్తున్నట్లు సమాచారం.

నిఘాతో దొరికిపోయిన వైనం!

చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు పోలీసులు అనేక రకాలుగా ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. చివరకు పాత నేరస్తులు ఎవరు ఎక్కువ డబ్బులు ఖర్చు పెడుతున్నారనే విషయంపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయగా అందులో ఒక పాత నేరస్తుడు ఈ మధ్యకాలంలో గోవా తదితర ప్రాంతాలకు తిరిగినట్లు సమాచారం రావడంతో అతనిపై నిఘా ఏర్పాటు చేసి అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాన్ని ఒప్పుకున్నట్లు సమాచారం.

కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య

మేదరమెట్ల: కడుపునొప్పి తగ్గక పోవడంతో యువకుడు బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొరిశపాడులో గురువారం వెలుగుచూసింది. కొరిశపాడు పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దాట్ల వేణు (20) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం కూడా కడుపునొప్పి రావడంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్ద ఇంజెక్షన్ తీసుకున్నాడు.



మృతి చెందిన దాట్ల వేణు

అయినా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో ఇంట్లో స్లాబు కొండికి చీరతో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తరువాత గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన మేదరమెట్ల ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పల్స్ తక్కువగా ఉన్నాయని మెరుగైన చికిత్సకోసం వేరే వైద్యశాలకు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. వెంటనే అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యశాల డాక్టర్ శ్రీను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీవీ చౌదరి తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈనెల 19న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి గురువారం తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన ప్రతి ఒక్క విద్యార్థి డిగ్రీ పట్టాతో పాటు ఉద్యో గాన్ని సైతం పొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నోడల్ కేంద్రాల్లో మెగా జాబ్‌మేళాలకు రూపకల్పన చేశారని వివరించారు.

ఇందులో భాగంగా శనివారం గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాలో ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్, వైఎస్కే ఇన్ఫోటిక్, ఫ్లక్స్‌టెక్ సొల్యూషన్స్, బాక్ ఎక్స్‌పర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, ఫిన్‌కేర్ బ్యాంక్, హెటిరో డ్రగ్స్, క్యూలెక్స్ ఇండస్ట్రీస్, టెక్నోటాస్, బిజినెస్ సొల్యూషన్స్ వంటి 30 రకాల కంపెనీలు పాల్గొనే ఉద్యోగాల కోసం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 12 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొని ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని జ్యోత్స్నకుమారి సూచించారు.

మత్తు పదార్థం స్వాధీనం

మార్టూరు: జాతీయ రహదారిపై బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద మార్టూరు పోలీసులు ఓ వ్యక్తి నుంచి 8 గ్రాముల మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్కే టీ ఫిరోజ్ వివరాల మేరకు.. గురువారం ఉదయం టోల్ ప్లాజా వద్ద పోలీసు అధికారులు తనిఖీ నిర్వహిస్తుండగా ఓ ప్రైవెట్ ట్రావెల్స్ బస్సులో అనుమానాస్పదంగా ఉన్న యువకుడిని అదుపులోనికి తీసుకొని విచారించారు. విచారణలో భాగంగా బస్సులో బెంగళూరు నుంచి వస్తున్న యువకుడు గుంటూరు సమీపంలోని రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్‌రోడ్డుకు చెందిన షేక్ నిజాముద్దీన్‌గా గుర్తించారు. అతని నుంచి 8 గ్రాముల నిషేధిత మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకొని నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విజృంభించిన ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు

- ఏడు వికెట్ల తేడాతో విజయం
- తడబడ్డ సెక్రటరీస్'

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నవులూరు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో గురువారం జరిగిన ఏసీఏ అండర్–19 ఉమెన్ ఇంటర్‌జోనల్ వన్డే మ్యాచ్‌లో సెక్రటరీస్ లెవెన్ జట్టుపై ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సెక్రటరీస్ లెవెన్ జట్టు 19.3 ఓవర్లలో 72 పరుగులు చేసి ఆలౌటైంది. జట్టు బ్యాట్స్ ఉమెన్ పి.హాసిని 39 బంతుల్లో నాలుగు ఫోర్లతో 23 పరుగులు సాధించింది. ప్రెసిడెంట్స్ లెవెన్ బౌలర్ శ్రిష్టి శేఖర్ రెండు ఓవర్లలో నాలుగు పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టింది. అనంతరం 73 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు 11.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టు బ్యాట్స్ ఉమెన్ ఎస్ సాయి లక్ష్మి 17 బంతుల్లో ఆరు ఫోర్లతో 29 పరుగులు చేసి రాణించింది. సెక్రటరీస్ లెవెన్ జట్టు బౌలర్ ఎస్‌జీ శ్రీనవ్య రెండు ఓవర్లలో తొమ్మిది పరుగులిచ్చి రెండు వికెట్లను పడగొట్టింది.

కౌలు రైతులందరికి పంట సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు

పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఇంగిరాల మురళీ

శావల్యాపురం: అర్హత కల్గిన కౌలు రైతులందరికి పంట సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఇంగిరాల మురళీ చెప్పారు. గురువారం మండలంలోని కనమర్లపూడి గ్రామం రైతుభరోసా కేంద్రంలో కౌలు రైతులకు పంట సాగు ధృవీకరణ పత్రాలు మంజూరు, ఈ–క్రాప్ నమోదు, తదితర వాటిపై వ్యవసాయ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో కౌలురైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు 56 వేల మందికి ఇవ్వటానికి లక్ష్యంగా ఎంచుకోగా ఇప్పటి వరకు 47 వేల మంది కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశామన్నారు. భూయజమాని అంగీకారంతో కౌలు రైతులకు పంట సాగు పత్రాలు ఇవ్వటం ద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉండవని, కౌలు రైతుల పంట సాగు పత్రం కాలపరిమితి 11 నెలల వ్యవధి మాత్రమేనన్నారు. పంట సాగు ధ్రువీకరణ పత్రాలు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు రైతుభరోసా పథకంతోపాటు ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిస్తాయన్నారు.



కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

రాబోయే రోజుల్లో విప్లవాత్మక మార్పులు వ్యవసాయ రంగంలో వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో 28 మండలాలు ఉండగా 4 మండలాల్లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు చేయటం వలన భవిష్యత్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పంట నష్టం వాటిల్లిన సమయంలో రైతులకు మేలు జరిగేలా బీమా సౌకర్యం అందుతుందన్నారు. జిల్లాస్థాయిలో జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా 600 క్వింటాళ్ల కంది విత్తనాలు రైతులకు ఉచితంగా అందజేశామన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, అన్నీ రకాల ఎరువులు 92 వేల 600 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో 421 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయని, ప్రతి రైతు భరోసా కేంద్రం రైతులకు అవసరమైన ఎరువులన్నీ సమృద్ధిగా ఉన్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితులు నెలకొంటే రైతులందరూ ఆరు తడి పంటలైన కంది, మినుము, చిరుదాన్యాలు కొర్రెలు, రాగులు, జొన్నలు పంటలు సాగు చేయాలని సూచించారు. అనంతరం కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా పంటలపై పిచికారీ చేసే విధంగా మండలానికి మూడు డ్రోన్లు మంజూరు అయినట్లు చెప్పారు. అనంతరం పంట సాగుపై రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఏడీఏ సీహెచ్.రవికుమార్, ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవోలు రామినేని రామారావు, అంజిరెడ్డి, అంకారావు, షేక్ నాసర్‌బేగం, ఏఈవోలు పురేటి అశోక్, సునీత, వీఏఏలు డి.స్రవంతి పాల్గొన్నారు.